ఊరూరా ఉట్టిపడిన భక్తిభావం


బెళుగుప్ప: అలంకరణలో గురుసిద్ధప్పస్వామి


కూడేరులో ఆదిదంపతుల రథోత్సవం , రథంపై కొలువుదీరిన పార్వతీ పరమేశ్వరుడు



బెళుగుప్ప: మండలంలోని ఎర్రగుడి కొట్టాలలో శనివారం గురుసిద్ధప్పస్వామి పీఠం తిమ్మదాసుస్వాముల 30వ వార్షిక ఆరాధన ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీఠాధిపతి గురుమహాలింగస్వామి ఆధ్వర్యంలో ఆరాధనోత్సవం నిర్వహించారు. ఆలయంలోని గురు సిద్ధప్పస్వామి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి, భగవద్గీత పూజ, గంగపూజ, గోపూజ, ప్రత్యేక పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన స్వయంభూ జంబుకేశ్వరస్వామి బ్రహ్మ రథోత్సవం శనివారం వైభవంగా జరిగింది. స్వామికి బ్రాహ్మణసంఘం, దేవదాయశాఖ ఈఓ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి, ఉదయం 11 గంటలకు మడుగుతేరు లాగారు. అంతకుముందు స్వామి వారిని పల్లకీలో ఊరేగించి రథం వద్దకు తెచ్చారు. సాయంత్రం వినాయక సర్కిల్ నుంచి బళ్లారి రోడ్డు బొడ్డురాయి వరకు స్వామి బ్రహ్మ రథోత్సవం నిర్వహించారు.

వైభవం.. సంగమేశ్వరుడి కల్యాణం

బొమ్మనహాళ్: శింగానహళ్లి సమీపంలోని వేదావతి చిన్న, పెద్ద హగరి నదులు కలిసే చోట వెలసిన సంగమేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం సంగప్ప, సంగమ్మ కల్యాణ మహోత్సవం నిర్వహించారు. రాత్రి 9 గంటలకు శింగానహళ్లి నుంచి ఉత్సవ సామగ్రి ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకొచ్చారు.

నేడు సంగమేశ్వర స్వామి రథోత్సవం : రథోత్సవం ఆదివారం సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వైభవంగా మల్లేశ్వర స్వామి మహారథోత్సవం

ఉరవకొండ: పట్టణంలో ప్రసిద్ధిగాంచిన మల్లేశ్వర స్వామి మహారథోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఉదయం స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి ఉత్సవమూర్తిని రథంలో ఉంచి ముందుకు లాగారు. రాకెట్ల గ్రామంలో సుంకలమ్మ రథోత్సవం నేత్రపర్వంగా సాగింది.

కనుల పండువగా ఆదిదంపతుల రథోత్సవం

కూడేరు: దక్షిణ భారత దేశంలో ప్రఖ్యాతిగాంచిన స్వయంభు జోడు లింగాల సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం ఆదిదంపతుల రథోత్సవం కనుల పండువగా సాగింది. పార్వతీపరమేశ్వర ఉత్సవ విగ్రహాలను రథంపై కొలువదీర్చి మడుగు తేరు లాగారు. సాయంత్రం 5:30 గంటలకు అశేష భక్తజన నడుమ రథాన్ని లాగారు.

ఆంజనేయస్వామి రథోత్సవం

కుందుర్పి: మలయనూరు, బండమీదపల్లి గ్రామాల్లో ఆంజనేయస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. స్వామికి ఆలయంలో పూజలు చేశారు. మధ్యాహ్నం మడుగుతేరు, రథోత్సవాన్ని నిర్వహించారు.

వైభవంగా సుంకులమ్మ అవ్వ రథోత్సవం

వజ్రకరూరు: మండలంలోని ఛాయాపురంలో సుంకులమ్మఅవ్వ రథోత్సవం శనివారంవైభవంగా జరిగాయి. అనంతరం మధ్యాహ్నం మడుగుతేరు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని తీసుకొచ్చి రథంపై ఉంచారు. ఉత్సవానికి ఎమ్మెల్సీ వై.శివ రామిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.


ఉరవకొండలో మల్లేశ్వరస్వామి రథోత్సవం


ఛాయాపురంలో సుంకులమ్మఅవ్వ రథోత్సవం


సుంకులమ్మ అవ్వ రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

జరుట్లరామలింగేశ్వరస్వామి ఆలయం సందర్శన

వజ్రకరూరు: మండలంలోని జరుట్లరాంపురంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీజరుట్ల రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయ స్తపతి పరమేశ్వరప్ప (విజయవాడ), కర్నూల్ దేవదాయశాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ ప్రసాద్, కర్నూల్ అసిస్టెంట్ స్తపతి సుబ్రమణ్యం శనివారం సందర్శించారు. ఈసందర్భంగా వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ అంగదాల కృష్ణయ్య, అర్చకులు రాజేంద్రప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిమాన్వితుడు చిక్కణ్ణేశ్వరుడు


చిక్కణ్ణేశ్వరస్వామి ఆలయం


స్వామి వారి మూలవిరాట్

- నేడు అంగరంగ వైభవంగా రథోత్సవం

కణేకల్లు: కణేకల్లు పరిసర ప్రాంతప్రజల ఆరాధ్యదైవం, భక్తుల పాలిట కొంగు బంగారమై విరాజిల్లుతూ నిత్య పూజలందుకుంటున్న చిక్కణ్ణేశ్వరస్వామి ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. కణేకల్లు, మండల ప్రజలు చిక్కణ్ణేశ్వరస్వామిని ఇంటి ఇలవేల్పుగా ఆరాధిస్తారు. ఏ శుభ కార్యక్రమం చేసినా ముందుగా స్వామికి ప్రత్యేక పూజలు చేస్తారు. ఆ తర్వాత మిగిలిన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రతి ఏటా స్వామి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణతోపాటు కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో ఉత్సవాలకు రావడం విశేషం.

చిక్కణ్ణేశ్వరస్వామి వారి చరిత్ర ఇదీ..

సుమారు 600 ఏళ్ల క్రితం శ్రీకృష్ణదేవరాయుల పరిపాలన సమయంలో కణేకల్లు ప్రాంతంలో సంస్థానాధీశుడిగా చిక్కణ్ణయ్య పని చేశారు. ఈయన ఈశ్వరుడి భక్తుడు. నిత్యం ఈశ్వరుడిని ఆరాధిస్తూ పూజలు చేసేవాడు. అంతే కాక ఈయన మహిమాన్వితుడు కూడా. కణేకల్లు ప్రాంతంలో కరువు కాటకాలు వచ్చి ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతుంటే తన మహిమతో శివారు ప్రాంతంలో చెరువు నిర్మాణానికి పూనుకున్నారు. ప్రస్తుత చెరువులో ఓ పెద్ద కొండ ఉండేదని పరిసర గ్రామాల్లోని పశువులు, గొర్రెలు ఈ కొండ వద్దకు మేత కోసం వచ్చేవని కథనం. ఇక్కడ కరువు పరిస్థితుల దృష్ట్యా చిక్కణ్ణయ్య తన మహిమతో కొండను మాయం చేసి, ప్రజలతో చెరువు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చెరువు నిర్మాణ పనిలో ప్రజలను భాగస్వాములను చేయించి, పని పూర్తయ్యాక ఒక్కొక్కరు తమ వద్ద మట్టికుప్పలను పెట్టుకోమని సూచించేవాడు. ఆ తర్వాత మట్టికుప్పలపై ఓ కర్రతో తిప్పి కన్నడలో 'మాడిదవరిగే మాడిదస్టు... నీడిదవరిగే నీడిదస్టు' అని చెప్పే వారు. 'చేసినోళ్లకు చేసినంత... పెట్టినోళ్లకు పెట్టినంత' అని దాని అర్థం. తన మహిమతో శ్రమకు తగిన ఫలితం నాణేల రూపంలో లభ్యమయ్యేలా చేసేవాడని పూర్వీకుల కథనం. కొన్నేళ్ల తర్వాత ఆయన చెరువు గట్టు వద్ద తన ఆరాధ్యదైవమైన ఈశ్వరుడిని స్మరించుకుంటూ సజీవ సమాధి అయినట్లు సమాచారం. కణేకల్లు ప్రజల కష్టాల్లో పాలు పంచుకొని నిత్యం పచ్చగా ఉండాలనే ఆశతో చెరువు నిర్మాణం చేసిన ఈయనకు ప్రజలు ఆలయం కట్టి నిత్య పూజలు, నైవేద్యాలు సమర్పిస్తున్నారు. ఏటా ఉగాది తర్వాత 15వ రోజున చైత్రశుద్ధ పౌర్ణమి రోజున స్వామి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఉత్సవాల్లో భాగంగా 13న రథోత్సవం జరుగనుంది. ఉత్సవాల కోసం ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది.

ఘనంగా చిక్కణ్ణేశ్వరస్వామి ఉత్సవం


రథంలో కొలువుదీరిన చిక్కణ్ణేశ్వరస్వామి

కణేకల్లు: మండల కేంద్రమైన కణేకల్లులో శనివారం రాత్రి చిక్కణ్ణేశ్వరస్వామి ఉత్సవం ఘనంగా జరిగింది. ఉదయం భక్తులు కలశలతో వేదవతి హగిరికెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి, వేదవతి హగిరి జలాలను ఊరేగింపుతో ఆలయానికి తీసుకొచ్చారు. వీరభద్రుడి వేషధారణలో ఓ వ్యక్తి చేసిన వీరగాసే నృత్యం విశేషంగా ఆకట్టుకుంది. ఆలయంలో స్వామికి వేదవతి హగిరి నుంచి పవిత్రమైన గంగాజలాలతో అభిషేకం చేశారు. అనంతరం ప్రధాన అర్చకులు మృత్యుంజయ్యస్వామి, వీరేష్‌స్వామి మంగళారతి, మహా మంగళారతి, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం నిర్వహించారు. రాత్రి 7.30 గంటల సమయంలో రథంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి ఊరేగించారు.


చిక్కణ్ణేశ్వరస్వామి ఉత్సవంలో పాల్గొన్న భక్తులు